
# ఊహలఉయ్యాల



ఆ ఊరి పేరు కొంకనక్కల పెంట!

కొంకనక్కలపెంటకు కూతదూరంలో కోట్లవారిపేట. ఆ పేట– పేరు సార్థకపరుచుకొనింది.

పేరు సార్థకపరుచుకొన్న ఆ పేటలో చెత్తా చెదారాన్నంతా ఊడ్చి ఊరవతల కుప్పపోస్తే– ఆ కుప్ప మాదిరి ఉంటుంది కొంకనక్కలపెంట!

కొంకనక్కలపెంటలో నాలుగైదు గడపలకు తక్కువగా నలభై గడపలుంటాయి. అందులో సగానికి పైగా చుట్టుగుడిసెలు. మిగిలినవన్నీ మూడంకణాల అడ్డాపిండ్లు. అడ్డాపిండ్ల ముందరైనా చుట్టుగుడిసెలముందరైనా వెదురుతడికల ప్రహరీగోడలుంటాయి. అందులో ఒకమూలగా తొట్టి రెండు మూడు బానలు. తాటికాయంత ముంత పాచిగట్టి మసిబారి ఎండపూట తాటికాయ రంగుతో పోటీపడుతుంటాయి. ఆ ఇంటికి అది పెరడు. ఇంటి ముందర్నే జలదారి. ఆ జలదారిపై దాడిచేస్తూ దోమలగుంపు! ముక్కుపుటాల్ని అదరగొట్టే కంపు!!...

ఈ దేశప్రగతికి సాక్షిగా నిలబడ్డ అది ఒక పల్లె!

ఇలాంటి పల్లెల్నే ఈదేశంలో కవికుమారులు 'పల్లెరా అదిపల్లెరా! పాడిపంటల ముల్లెరా!' అని కీర్తించేది.

కొంకనక్కలపెంటలో కాలూనడానికి కండుచిట్లించే కోట్లవారి పేటలో కలవాళ్ళు కండ్లు నులుముకొంటూ నిద్రలేచి బద్ధకాన్ని బండెక్కించక ముందే కొంకనక్కలపెంట వైపు కండ్లు ఇంతింతచేసి ఎదురుచూస్తూ ఉంటారు– పాలకో...పండ్లకో...లేదు కూరగాయలకో!...

కోట్లవారిపేటలోకానీ కొంకనక్కలపెంటలో కానీ అందరూ ఆస్తిపాస్థులపట్ల ఆసక్తులే!– అయితే ఆ పూరికొంపల్లో చాలమంది ఆస్తిపాస్తులమాట తలపెట్టలేని అశక్తులే!– ఆ అశక్తులకు కూడా కడుపులున్నాయి. ఆకడుపుల్లో ఆకలి తిష్ఠవేసింది. దాని పలుకు ఎత్తకుండా ఉండాలంటే ఏదో ఒక విధంగా నాలుగు వేళ్ళు నోట్లోకి పోవలసిందే!

నాలుగువేళ్ళు నోట్లోకి పోవడం ఈ వ్యవస్థలో అందరికీ అంత సులభమైన పనికాదు. అందుకే ఆఊరు తనఅవస్థతాను పడుతూఉంది.

కొంకనక్కలపెంటలో ప్రతి మనిషీ శక్తివంచన లేకుండా పుడమి తల్లితో పోరాడుతున్నాడు. ఫలితాన్ని పేటకు చేరుస్తున్నాడు. పేట ఆ ఫలితాన్ని అతితెలివిగా చేతులు మారుస్తూ ఉంది. ఆ మారుబేరంలో పేట మహడీమీద మహడీగా పెరుగుతూనే ఉంది. అయితే కొంకనక్కలపెంట మాత్రం– ఎక్కడున్నావే గొంగళి అంటే వేసినచోటనే!– అన్నట్లుగా ఎదుగుబొదుగు లేకుండా ఉంది.

కొంకనక్కలపెంటలో ముంతడు పాలు కానీ, గంపడు కూరగాయలు కానీ, బండెడు వేరుశనక్కాయల్ని కానీ ఎంతో శ్రద్ధగా పేటకు చేర్చే రైతు తన బిడ్డల్ని మాత్రం పేటకు పంపడానికి తరతరాలుగా వెనకాడుతూనే ఉన్నాడు.

అంటే– కొంకనక్కలపెంటలో కుర్రవాళ్ళకి పేటంటే భయమనికాదు. పేటంటే తెలియదని కాదు. తూర్పున పటమెగరక ముందే చెంబుడుపాలు చేతికిచ్చి శాస్త్రులు గారింట్లో ఇచ్చిరమ్మని మునెప్ప తన ముద్దుల కొడుకును పంపుతున్నాడు. మలికోడి కూతలో మేలుకొన్న లిక్కి వరదప్ప తనకొడుకు గోవిందును ఏడాదిగా తాను వెంటబెట్టుకొని మేపిన పొట్టేల్ని ఖాదర్ సాహెబ్ కసాయి అంగట్లో తోలిరమ్మని పురమాయిస్తాడు. గంపకు ఎక్కువై మిగిలిన కూరగాయల్ని బుట్టలోవేసి ఆ బుట్టను నెత్తినపెట్టి పేటకు తనవెంట నడవమంటాడు మనుమణ్ణి గంగులయ్య తాత. అయితే పేటలో ఉండే బడికి పంపమంటేనే, 'సదువుకుంటే వాలపడబొయ్యేదేముండాది? అంతకుమించి వొరగబడ బొయ్యేదేముండాది?' అని ఎదురు ప్రశ్న వేస్తూనే ఉన్నారు.

అయితే అనుముల అంకయ్య మాత్రం ఏటికి ఎదురీదినట్లుగా తన ఒక్కగానొక్క కొడుకును పేటకు పంపుతున్నాడు.

ఆఊళ్ళో అనుముల అంకయ్యకు చుట్టుగుడిసె మినహాయిస్తే చిట్టెడు పొలంలేదు. పైసా ఇరుపులేదు. అప్పు పుట్టించుకోగల పరపతి అసలేలేదు.

అయినా అంకయ్య తన బిడ్డను చదివిస్తున్నాడు!

ఇక ఒకే ఒక్క ఏడట్లా కండ్లు మూసుకొంటే తనకొడుకు పదవతరగతి దాటేస్తాడు. పదవ తరగతి చదివినవాడికి ఏదో ఒకఉద్యోగం రాకుండాపోదు. వస్తే తనకష్టాలన్నీ గట్టెక్కినట్లే!– అన్న అభిప్రాయంతో అంకయ్య ప్రాణం ఉగ్గబట్టి పనిచేస్తున్నాడు. కూలిచేసి కడుపుగట్టి కొడుకును బడికి పంపిస్తున్నాడు.

అంకయ్య కొడుకును బడికి పంపిస్తున్నాడు. వాడు పోతున్నాడు. శ్రద్ధగా చదువు కొంటున్నాడు. వస్తున్నాడు. అంకయ్య పెళ్ళాం అలిమేలు కూడా తాను తిన్నా తినకున్నా వేళకంత సంకటో సలిబిండో బిడ్డకు పెడుతూఉంది. అంతవరకు బాగానేఉంది. అయితే వాడు "పరీక్షకు ఫీజు కట్టాలయ్యా!... పుస్తకాలు కొనుక్కోవాలయ్యా!... పదోతరగతి చదవతా ఉండికూడా నిక్కరేసుకొని పొయ్యేదానికి జంకుగా ఉంటుందయ్యా!" అని అడగలేక అడుగుతూ తల గీరుకొంటూ ముందు నిలబడినప్పుడే అంకయ్య గొంతులో పచ్చివెలక్కాయ పడుతూ ఉంటుంది.

కూలిచేస్తే కుండగాలు. లేకుంటే కడుపుగాలు బతుకు అంకయ్యది. అల్లాంటప్పుడు కొడుకు అవసరాలు తీర్చాలంటే ఏ అయ్యముందరో చేతులు కట్టుకొని నిలబడాల్సిందే!...

చేతులు కట్టుకొని నిలబడినంత మాత్రాన ఉన్నవాళ్ళ చేతలు మారుతాయా? రీతులు మారుతాయా? నీతుల్తో మూతుల్ని నిమరకుండా వదిలిపెడతారా? అందుకే–

"ఒరే! అనుఁవులూ! ఎందుకొచ్చిన బాదరా యిదంతా?... నెత్తిన నోరుబెట్టుకోని మొత్తుకుంటే నీ సెవల్లో సెట్లు మొలిసెనే!– ఏం జెయ్యాలసెప్పు? అహాఁ! వాడు సదువు కోని ఉద్దోగాల్జేసి ఊళ్ళేలబొయ్యేది లేదుకదా? ఏదో ఒక మేకపిల్లనో గొర్రెపిల్లనో పట్టియ్యి. ఏడాదట్టా తిరిగీ తిరగకముందే అదికట్టి ఈనిందంటే ఒకటిరెండవ్వచ్చు. మూడవ్వచ్చు. ఇంకొక్క యేడాది కండ్లట్లా మూసుకుంటే సేతిలో రూక!–రూకకు రూక కూడేసుకుంటాపోతే అనుఁవులూ! ఇయ్యరవకు రెండు బర్రెగొడ్లు ఇంటిముందరుండేవిగదా? పోనీ! ఇప్పటికైనా మించిపొయ్యిందేఁ వీ లేదు. వాణ్ణి ఇస్కూలకి పంపేది మానుకో. మేకల్నీ గొర్రెల్నీ నేను పట్టిస్తా!– వాడు మేపకరానీ సాలు. నీకష్టాలెట్లా తీరవో నేన్చూస్తా!"

అంతో ఇంతో ఉన్నవాడు ఎంతోఅభిమానాన్ని ఒలకపోస్తాడు. అంకయ్య ఆ అభిమానాన్ని తట్టుకోలేక ఇంకొక్క అయ్యదగ్గరికి బయలుదేరతాడు. అంకయ్య ముందుకుపోతూంటే వెనక నవ్వులపువ్వులు పల పల రాలుతుంటాయి.

అంకయ్య ఇంకొక్క అయ్యదగ్గర చేతులు కట్టుకోవడమేకాదు. ఇంకాస్తవంగి నిలబడతాడు. వంగి నిలబడితేమాత్రం ఉన్నవాళ్ళు వంగతారా? అలా అయినవాడు కానివాడు వచ్చి వంగి వంగి నిలబడితే ఆ వంగుళ్ళకు నంగేడుపులకు వాళ్ళు వంగిపోతే ఇక వాళ్ళు ఉన్న వాళ్ళెలాఅవుతారు? కారు కాబట్టే–

"అంకయ్యా! శాతగానమ్మకు సెవుకాడ కొప్పని ఊరికే అన్లేదురా పెద్దోళ్ళు!– అప్పిటికి మేఁవంతా యదవలఁవయినట్లు. నువ్వేమో మహామొనగోదయినట్లు– కాదంటే అవునంటివి. సేతికింద బిడ్డుంటే కాలికి చెప్పు ఉణ్ణంత కత! అంతోయింతో కయ్యాగాలవ ఉన్నోళ్ళం. మేఁవే సదివించుకోలేకుండా గొడ్డూ గోదనూ మేపకరమ్మంటావుంటే– ఊరు సూడమంటే ఉత్తరం జూసినట్టు నువ్వేమో వాణ్ణి పేటకు పంపిస్తివి. ఇప్పుడు సేతులు పిసుక్కుంటా నిలబడ్తే ఎవురేంజేస్తారు సెప్పు. నువ్వే సెప్పు!"

చెప్పగలిగిందానికిమించి వాళ్ళే చెప్తూఉంటే అంకయ్యమాత్రం ఏమని చెప్తాడు? చెప్పలేడు కాబట్టి వినేవాళ్ళు దొరకతారేమో? అన్న ఆశతో బయలుదేరతాడు. ఎంత తిరిగినా తలచుట్టి నోటిదగ్గరికి వచ్చినట్లే అవుతుంది.

అంకయ్య ఇలా ఎంతెంతమంది ముందర నిలబడ్డాడో? ఎన్నెన్ని అనిపించుకొన్నాడో? సేతులు కాదని కాళ్ళే పట్టుకొన్నాడో? దేవుడికే ఎరుక. ఒక్కగా నొక్క నలుసు... ఎంతో శ్రద్ధగా చదువుకొంటున్నాడు. వాడి ఆశలు తీర్చలేక ఏ చెట్టుచాటులోనో నిలబడి ఎన్నెన్ని దినాలు వెక్కివెక్కి ఏడ్చినాడో?

పట్టువదలని విక్రమార్కుడిలా పట్టుబట్టాడు. పడరానిపాట్లు పడ్డాడు. వినరాని మాటలు విన్నాడు. ఒకపూటతిని ఇంకొక్క పూట తినక మిగలబెట్టినంతవరకు మిగలబెట్టి కొడుకు కోర్కెలు తీరుస్తున్నాడు. అయినా ఒక్కొక్కప్పుడు పదిమంది చెప్పిన మాట పెడచెవినిబెట్టి ఎందుకీపని చేసినానా? అని పశ్చాత్తాపపడుతున్నాడు. 'ఇంకీ బారాన్ని మొయ్యలేనురా తండ్రీ!' అని మొత్తుకొంటున్నాడు. అయితే ఒకనాడు కొడుకు పరుగుపరుగున వచ్చి 'అయ్యా! నేను ఫస్ట్ క్లాసులో పాసైనానయ్యా!' అని అన్నప్పుడు మాత్రం అంకయ్య గుండె ఆనందంతో గంతులు వేసింది. ఇక తన కష్టాలన్నీ సూర్యరశ్మి ముందు మంచుబిందువుల్లా కరిగిపోతాయనే కలలుగన్నాడు. ఆ కలల్లో తేలిపోతూ ముద్దుల కొడుకును ముద్దులతో ముంచెత్తాడు.

ఆ రోజు చుట్టు గుడిసెలో ఆనందం సుళ్ళు తిరిగింది.

ఆ రోజు వరకు అంకయ్య కొడుకు మాత్రమే పేటకు పోయివస్తున్నాడు. ఇప్పుడు కొడుకుతో కలిసి అంకయ్య కూడా పేటకు పోతున్నాడు. చేస్తున్న పనిని వదిలిపెట్టి కొడుకును వెంటబెట్టుకొని కోట్లవారిపేటలో తిరుగుతున్నాడు. కాసంత తెల్లగా తేటగా కనుపించిన వాళ్ళనంతా నిలబెట్టి 'సాఁవీ సాఁవీ! పదోతరగతి ఫస్టుక్లాసులో పాసయినాడు సాఁవీ! ఏదైనా ఉద్యోగం సాఁవీ! పిలగాడు శానా తెలివైనోడు సాఁవీ! మేగంలో నీళ్ళు తెమ్మంటే తటిక్కెమని తెచ్చేస్తాడయ్యా!– మీరు గొప్పమణుసుజేసి ఏదైనా ఉద్యోగం యిప్పించండి సాఁవీ!" అని ఏ కుంటివాడో గుడ్డివాడో ధర్మం అడిగినంత సులువుగా అడిగేస్తున్నాడు.

అంకయ్యను అందరు అదోరకంగా చూస్తున్నారు. ఆ తరువాత పిచ్చిగానీ పట్టలేదుకదా? అని ఆలోచిస్తున్నారు. 'లేదు!' అని నిర్ధారించుకొన్న తరువాత తేలిగ్గా నవ్వేస్తున్నారు.

వాళ్ళు ఎందుకు నవ్వుతున్నాలో? అర్థంకాకుండా అంకయ్య వాళ్ళవైపు తెల్లపోయి చూస్తున్నాడు. తెగ బాధపడిపోతున్నాడు. ఒక్కొక్కసారి కడుపు రగిలి కొరకొర చూస్తున్నాడు. చరచర ముందుకు నడుస్తున్నాడు.

నడిచీ నడిచీ కాళ్ళు పీకుతున్నాయి. అడిగి అడిగి నోరు నొస్తూ ఉంది. తన నిస్సహాయత మీద తనకేకోపం వస్తూఉంది. అయినా ఏం చెయ్యగలడు? పేదవాని కోపం పెదవికే చేటు!–

ఏం చెయ్యలేనప్పుడు చేతనైనపని ఒక్కటే! జుట్టు పీక్కోవడం! పీక్కొన్నాడు. తలకొట్టుకొన్నాడు. కొంకనక్కలపెంటలో పెద్దోళ్ళు చెప్పినమాట తలుచుకొని తలుచుకొని ఏడస్తాడు.

తండ్రి ఎందుకు ఏడస్తాడో అర్థంకాక కొడుకు తండ్రివైపు చూస్తాడు. ఓదార్చే వైనం తెలియక తికమక పడతాడు.

అంతలో పొద్దు గూట్లో పడుతుంది.

అబ్బ కొడుకు గూడు చేరడానికి బయలుదేరతారు.

దారిలో ఎవరూ కంటపడకపోతే ఏ బాధా లేదు. గుట్టుగా గుడిసెజేరి కాళ్ళెత్తి కడుపులో పెట్టుకొని ముడుక్కుంటారు. ఎవరైనా ఎదురు పడినపుడే లేనిపోని పీకులాట!–

“ఏఁవిరా అంకయ్యా! నల్లపూసవైపోతివి గదరా!– అవున్లే కొడుకు ఫస్టు కళాసులో పాసైపాయగదా! ఇంక నీకేం తక్కవలే!” అని ఒకరంటే–

“ఏఁవిరో అనుఁవులూ! కొడుక్కు ఉద్దోగం వచ్చేసినట్టేనా? ఏం ఉద్దోగంరే?– కలెక్ట్రా?... తాసీల్దారా?”... అని మరొకరి ఎత్తిపొడుపు.

పుండుమీద కారం చల్లినట్లుంటుంది! అయినా వంచిన తలెత్తడు అంకయ్య. పెదవి కదపడు అంకయ్య. నవ్విన ఊళ్ళే పట్నాలవుతాయని నమ్మకం పాపం!–

ఒకానొకదినం కోట్లవారిపేటలో ఆ తండ్రి కొడుకుల దయనీయమైన పరిస్థితిని అర్థం చేసుగొన్న ఒకానొక దయామయుడు శుక్ర గ్రహాన్ని చేరుకొనే సూక్ష్మం తెలిసినంత ధీమాగా ఎంప్లాయిమెంట్ ఆఫీసుకు దారిచూపి అక్కడికి పోతే అక్కడికక్కడే ఉద్యోం ఖాయం అన్నట్లు ధైర్యం చెప్పాడు.

అంకయ్య అరక్షణంలో ఆ ఆఫీసుముందర నిలబడ్డాడు.

ఆ ఆఫీసుముందరొక పెద్ద క్యూ!

రెండు రూపాయల కిలో బియ్యం కోసరం కిరసనాయిలు కోసరం గంటలతరబడి నిలబడిన అనుభవం ఉంది కాబట్టి అంకయ్య ఆ క్యూని చూచి ఆశ్చర్యపడలేదు. ‘ఇది అలవాటే గదా?’ అన్నట్లుగా కొడుకును పక్కన నిలబెట్టుకొని తాను ఆ క్యూలో నిబడుకొన్నాడు.

ఆ క్యూ నడిచింది నడిచింది నత్తనడక నడిచింది!

మిట్టమధ్యాహ్నం వేళకు అంకయ్యవంతు వచ్చింది.

ఆఫీసర్ ఎదుట నిలబడి నిలబడగానే అంకయ్య రెండు చేతులు పైకెత్తి దండం పెట్టాడు. అయితే ఆఫీసర్ వంచిన తలెత్తకుండా ఏదో రాసుకొంటూ ఉన్నాడు.

"అయ్యా అయ్యా! ఈడు నా కొడుకయ్యా! అష్టకష్టాలుపడి చదివించినానయ్యా!...పదో తరగతి పస్టు కళాసులో పాసైనాడయ్యా!...ఆ పూటకు గెంజికికూడా నోసుకోని పేదోణ్ణయ్యా! కాంవందులవారు గొప్పమణుసు జేసి నా బిడ్డకొక ఉద్దోగం ఇయ్యాల్సిందేనయ్యా!"

క్యూలో నిలబడినంతసేపూ బుర్ర బద్దలు కొట్టికొట్టి ఆలోచించి ఆలోచించి మననం చేసుకొన్న మాటల్ని దాదాపు ఏడుపు గొంతులో ఏకరువు పెట్టాడు.

ఆఫీసర్ వంచినతలెత్త లేదు!

అంకయ్య పైకెత్తిన చేతులు దించలేదు.

గోడమీది గడియారం వీళ్ళకోసం క్షణం ఆగలేదు.

అంకయ్య ఓర్పు దెబ్బతినింది.

"అదేందయ్యా? – పొట్టకర్రకొచ్చిన సేన్లో మాపక్కింటోళ్ళ పొటేలి పొయ్ పడినట్లుండాదే యవ్వారం. సెప్పింది సెవల్లో ఏసుకోకుండా ఒక్కమోపన రాసుకుంటాఉండావే?" –

వంపులు తిరిగిన క్యూలో నవ్వులు కెంపులు తిరిగాయి.

ఆఫీసర్ చెవుల్లో ఆ నవ్వులు మాత్రం దూరినట్లున్నాయి.

చివుక్కున తల పైకెత్తాడు.

"ఎవన్నావురా! ఫూల్!... ఇడియట్!... గెటవుట్!!...పోరా పో!... ఎవుడితో చెప్పుకొంటావో చెప్పుకో పోరా! – నీయబ్బకు లేకుంటే వాడెబ్బకు! ఉద్యోగాలంటే చెట్లో కాసే చింతకాయ లనుకొన్నారు వీళ్ళు. వస్తూనే కోసికోసి వీళ్ళచేతుల్లో పోయడానికి!...

చెప్పులమీద నిలబడినా ఆఫీసర్ నిప్పులమీద నిలబడినట్లు చిందులు తొక్కుతున్నాడు.

"అదిగాదయ్యా!..." అంకయ్య ఏదో చెప్పబోతున్నాడు.

"అది గాదెకాదు. ఇది బొట్టాకాదు. నోరు తెరిచినావంటే మెడపట్టి బయటికి గెంటిస్తా!... నడు బయటికి!" – ఆవేశంతో అరుస్తున్నాడు ఆఫీసర్.

అంకయ్య బయటికి నడిచాడు – మెడబట్టి గెంటవలసిన అవసరం లేకుండానే! – ఆ ఆఫీసు ముందర్నే దిగులుగా నిలబడుకొన్నాడు. అంతకు మునుపే తన మాటలకు విరగబడి నవ్విన గుంపు ఇప్పుడు తన్ను ఒకపురుగును చూసినట్లు చూస్తూ ఉంది. ఇక అక్కడ నిలబడలేక పోయాడు.

అంకయ్య బయల్దేరాడు!

ఎటు వెళ్ళాలి?... పేటకు నాలుగు దిక్కులు. నాలుగు దిక్కులకు నలభై దోవలు. ఏ దోవనుబట్టి పోవాలి? – అని ఆలోచిస్తూనే అలవాటు మేరకు కొంకనక్కలపెంట దారే పట్టాడు.

అంకయ్య ఇంట్లో అడుగుపెట్టాడు!

ఇంట్లో ఇల్లాలు అలిమేలు అలిగినట్లు మంచంమీద ముడుక్కోనుంది. ఎదురింటి వాళ్ళ పిల్లి తనఇంటి పొయ్యిలో హాయిగా పడుకొని ఉంది!

అప్పటికి అంకయ్య కూలికి వెళ్ళి పదిరోజలకు పైబడింది. చేతిలోవున్న రూకా అడ్డగా తిరుగుళ్ళలో చేతిఖర్చులకే సరిపోయింది. ఆ చుట్టు గుడిసెలో కడవల్లేవు. కాగులూ లేవు. అడుగు బొడుగు దోర్సుకొన్నా ఆ పూట గడుస్తుందనడానికి! అందుకే అటు యిటు చూడకుండా ఒక్కలగువులో వెళ్ళి బోడిరెడ్డి పంచన నిలబడ్డాడు, అంకయ్యను చూసీ చూడగానే బోడిరెడ్డి అందుకొన్నాడు.

"ఏఁవిరే అనువులూ! ఎంతదా నీకొడుకు పస్టు కళాసులో పాసైతే మాత్రం మణిసే కనపడకుండా పోతివిగదరే?- మొన్నా పెద్దబాయిలో తిరుగుడు కపిలతోలేదానికి మణిసి దొరక్క తికమక పడిపోతిగదరా! అయినా ఇంక నీకేం కర్మ పట్టిందిలే కూల్జేసేదానికి?- కొడుకు సంపాయిస్తా ఉంటే కాలుమింద కాలేసుకోనితింటా ఉండే పనేగదా?..."

కడుపు మంట కాపురానికి రేజీకటి మగడంట!

అంకయ్య అభిమానం చచ్చింది కానీ, ఆకలి చావలేదు.

ఆ ఊళ్ళో మానెడుగింజలు పుట్టించుకోవడానికి పుట్టెడు దెప్పించుకొన్నాడు.

*　　　*　　　*　　　*　　　*

కొడుకు పదవతరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసైనా అంకయ్య రోజూ కూలికి పోతూనే ఉన్నాడు.

అలిమేలు ఆయింటా.... ఈయింటా- పాచిపనులు చేస్తూనే ఉంది.

ఆపై చదువులకు పోలేకుండా ఇటు కూలిపనులు చేతగాక అంకయ్య కొడుకు అమ్మా నాయనా కష్టపడుతుంటే చూస్తూనే హాయిగా కూర్చొని తింటున్నాడు- అంతకంటే ఏమీ చేయడానికి చేతగాక!-

అంకయ్య ఎదుటపడితేచాలు- ఊరు ఎకసక్కేలాడుతూనే ఉంది.

కష్టాలు అడుగడుగునా కాలాన్ని గుర్తుచేస్తుంటే కాలయంత్రం తెలియకుండా నడుస్తూనే ఉంది.

ఏడాది గడిచిపోయింది!-

రెండు బారల పొద్దెక్కిన సమయాన...కొంకనక్కలపెంట పనీ పాటకని బయలుదేరుతున్న వేళలో ఊరిముందర ఒకజీప్ వచ్చిఆగింది.

బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్లుగా ఆ ఊళ్ళో పెద్దా చిన్నా తరతమ భేదాలు లేకుండా ఆ జీపును చుట్టుముట్టారు.

ఆ జీప్‌లోనుండి ఒక ఆఫీసర్ హుందాగా దిగాడు. బిళ్ళ జనాను పిల్లల్ని ఈగల్ని తరిమినట్లు తరుముతూంటే- ఆఫీసర్ పెద్దవాళ్ళ వైపు తిరిగి 'ఈ ఊళ్ళో చదువుకున్నవాళ్ళు ఎంతమందున్నారు?' అని ప్రశ్నించాడు.

"ఎందుకూ? ఉద్యోగాలేమైనా ఇయ్యబోతారా?" ఒక నోటిదురుసు మనిషి ఎదురు ప్రశ్నవేశాడు.

"ఉద్యోగాలెందుకురా? ఏకంగా రేపు ఎలక్షన్లలోనే నిలబెట్టేస్తారు!" ఇంకొకడు నోరు చేసుకొన్నాడు.

"మీరుండారే ఇతండఁవంటే కోదండఁవనే నాయాండ్లురా!– అడిగిందానికి బొదుల్జెప్తే పోలా?"– మరొక నెమ్మదస్తుడు జోక్యం చేసుకొన్నాడు.

"సెప్పు. సెప్తానంటే నిన్నెవురో ఇక్కడ పట్టుకోని పాతేసినట్టుండాదే!"

"సెప్తా(నా! సెప్తాను. ఎందుకుసెప్పను. అయ్యా! ఈ ఊళ్ళో ఒక్కడే ఒక్క పిలగాడండీ! వాడా అంకడి కొడుకు. పదోతరగతి పస్టుకళాసులో పాసైనాడంట!"

"ఆ కుర్రవాడొక్కడేనా చదువుకొనింది!" ఆఫీసర్ అడిగాడు.

"అవునయ్యా!"

"కనీసం ఏడవతరగతిదాకా కూడా ఎవ్వరూ చదవలేదా?" ఆఫీసర్ ఆశ్యర్యంగా అడిగాడు.

"మా అబ్బతోడు. వాడికి తప్పితే అచ్చరం ముక్కొచ్చిన ఎదవెవుడూ లేదండీ ఈ ఊళ్ళో!"

"అయితే ఆ కుర్రవానికి ప్రభుత్వం అయిదువేలు అప్పు ఇస్తున్నది"

"ఆఁ!"

ఆశ్చర్యంగా నోరు తెరిచింది ఊరు!

"అవునయ్యా! గ్రామాల్లో చదువుకొని ఉద్యోగంలేని కుర్రవాళ్ళకు ప్రభుత్వంచేస్తున్న సహాయం ఇది. ఈ అప్పుతో అతడు ఆవుల్ని కొనవచ్చు. గేదెల్ని కొనవచ్చు. కోళ్ళఫారం పెట్టుకోవచ్చు. లేదా ఒక చిన్న కుటీర పరిశ్రమ ఏదైనాసరే!– అప్పుయివ్వడమేకాదు మేము అతనికి ఆసరాగావుండి అన్ని సహాయాలు అందిస్తాం. ఇందులో నాలుగింట ఒకభాగం కేంద్రప్రభుత్వం సబ్సిడీ కింద ఉచితంగా ఇస్తుంది." అని అంటూ ఆఫీసర్ అంకయ్యని పిలిపించి ఆ కుర్రవాడి వివరాలు రాసుకొన్నాడు. ఆ తరువాత జీప్ దుమ్మురేపుకొంటూ వచ్చిన దారిన పట్టి వెళ్ళిపోయింది.

ఊహించని ఈ ఆస్తితో కొంకనక్కలపెంటలో ఊహాగానాలు లేచాయి.

అంకయ్య చుట్టుగుడిసెలో ఆనందం సుళ్ళు తిరుగుతూ ఉంది!

అంకయ్య అంకయ్య కొడుకు చుట్టు గుడిసెలో ఊహల ఉయ్యాల్లో కూర్చుని వెళ్ళిపోయిన జీప్ కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు! ●

ఆంధ్రపత్రిక
(13, ఏప్రిల్ 1984)